

ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై అవగాహన

శ్రీకాకుళం లీగల్ : షెడ్యూల్ తరగతులు, తెగలపైన దాడులను ఎదుర్కోవడానికి సంబంధిత చట్టాలు ఉపయోగించుకుని రక్షణ పొందవచ్చునని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. శాంతినగర్ కాలనీలో ఎస్‌సి, ఎస్‌టి హాస్టల్‌లో చట్టాలపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు స్టేషన్లలో బాధితుల ఫిర్యాదును నమోదు చేయకపోయినట్లయితే వాటిని ప్రైవేటు ఫిర్యాదు ద్వారా కోర్టుల్లో దాఖలు చేయవచ్చునని తెలియజేశారు. ఈ చట్ట ప్రకారం కలెక్టర్ ఆధ్వర్యాన ప్రతి మూడు నెలలకొకసారి విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి కేసుల పురోగతిపైన సమీక్షించాల్సి ఉందన్నారు. పౌర హక్కుల రక్షణ చట్టం ప్రకారం ప్రతి పౌరుడి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కార్యక్రమంలో జి.ఇందిరాప్రసాద్. అడ్వకేట్, డిసిపిఒ కె.వి.రమణ, సర్కిల్ ఇన్స్పెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ గణజపతి పాల్గొన్నారు.

యూరియా కోసం రగడ

- అధికారులను నిలదీసిన రైతులు
- సోమవారం పంపిణీ చేస్తామని అధికారుల హామీ



బూర్జ : యూరియా కోసం ఎఒ కార్యాలయం వద్ద గుమిగూడిన రైతులు

ప్రజాశక్తి- బూర్జ

అన్నదాతలు మరోసారి యూరియా కోసం రోడ్డు ఎక్కారు. బూర్జలో శనివారం యూరియా విక్రయాలు చేపడుతున్నట్లు సమాచారం అందడంతో మండలంలోని రైతులు మండల కేంద్రంలోకి చేరుకున్నారు. సదురు డీలర్‌కు 120 బస్తాలు రావడంతో మండలం నుంచి సుమారు 500 మందికి పైగా రైతులు క్యూ కట్టారు. ఉదయం నుంచి ఒక్కొక్కరుగా రైతులు డీలర్ వద్దకు చేరుకొని క్యూలో నిల్చున్నారు. తమ వంతుగా యూరియా అందుతుందో, లేదన్న ఆందోళనతో గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. వచ్చింది కేవలం 120 బస్తాలు అయితే... వందలాది మంది రైతులకు ఎలా విక్రయించాలో అర్థం కాని స్థితిలో మండల వ్యవసాయశాఖ అధికారి డి.ఉషారాణి తలలు పట్టుకుంది. వచ్చిన యూరియా తక్కువ, రైతులు ఎక్కువ, పంపిణీ చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచనతో సోమవారానికి ఎఒ, తహశీల్దార్ వై.వి.పద్మావతి వాయిదా వేశారు. దీనిపై ఆగ్రహం చెందిన రైతులు అధికారులపై మండిపడ్డారు. రైతుల జీవితాలతో ఆటలాడుతున్నారని, రైతులకు అవసరమైన యూనియన్ సకాలం లో అందించకపోవడంతో తీవ్ర నష్టాలు చూస్తామని రైతులు అధికారులను ప్రశ్నించారు. రైతులకు అవసరమైన యూరియాను పంపిణీ చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. పదెకరాలు ఉన్న రైతుకు కూడా కేవలం ఒక బస్తా యూరియా ఇస్తే ఎలా సరిపోతుందని నిలదీశారు. రైతులకు అవసరమైన యూనియన్ ఎరువులను సకాలంలో సక్రమంగా అందజేస్తున్న ప్రయత్నం గుర్తించిన ప్రభుత్వం మిన్నకున్నాడడంలో ఉండడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా అధికారులు ఒకటే మండలానికి వచ్చిన యూరియాను ఇతర ప్రాంతాలకు తరలించడం వల్ల యూరియా కొరత వచ్చిందని, రైతులకు పంపిణీ చేయాల్సిన యూరియాను రాజకీయ ప్రముఖులకు అందజేయడంలో ఉన్న ఆంతర్యం నిలదీశారు. దీనిపై స్పందించిన మండలం వ్యవసాయశాఖ అధికారులు పోలీసులు రైతులను శాంతింపచేశారు సోమవారం పూర్తిస్థాయిలో యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని సర్దిచెప్పారు. దీంతో రైతులు సాయంత్రం నాలుగు గంటలకు తమ గ్రామాలకు తిరిగి ముఖం పట్టారు.

పడిగాపులు

టెక్కలి రూరల్ : టెక్కలిలో యూరియా, డిఎపి ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్ షాపు వద్ద రైతులు శనివారం పడిగాపులు కాశారు. టెక్కలిలోని ఒక ప్రైవేట్ ఎరువుల డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉందన్న సమాచారం మేరకు టెక్కలి పరిసర ప్రాంతాల నుంచి రైతులు అక్కడికి చేరుకుని క్యూ కట్టారు. ఇప్పటికే వర్షాలు లేక తీవ్ర అవస్థలు పడుతుంటే... ఎరువులు లేకపోవడం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు డీలర్ల దగ్గర అధిక రేటు కొనుగోలు చేయాల్సి వస్తుందని, అదీ సకాలంలో ఎరువులు అందడం లేదని వాపోతున్నారు. ఎరువులు నిర్ణీత ధరల కన్నా అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటనలు చేస్తున్నారు.

'తమ్మినేని' హౌస్ అరెస్టు

ఆమదాలవలస : మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం రైతులకు ఎరువులు అందడం లేదంటూ గొడౌన్ వద్దకు వెళ్లేందుకు శనివారం ప్రయత్నించారు. సమాచారం అందుకున్న పోలీసులు సీతారాంను అదుపులోకి తీసుకున్నారు. శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్‌కు గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నుంచి 1500 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. అధికారులు శ్రీకాకుళానికి 1100 మెట్రిక్ టన్నులు, విజయనగరం జిల్లాకు 250 మెట్రిక్ టన్నులు, మన్యం పార్వతీపురం జిల్లాకు 150 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించారు. రైల్వే స్టేషన్‌కు గూడ్స్ వ్యాగన్‌లో యూరియా వచ్చిందని, మండలంలోని కొరత ఉందంటూ సీతారాం, వైసిపి నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్ రైల్వే గుడ్స్ షెడ్ ప్రాంతానికి వెళ్లారు. సమాచారం తెలుసుకున్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సివిల్ పోలీసులు అప్రమత్తమై బిఆర్ నగర్ వద్ద నిలిపివేశారు. మండల వ్యవసాయ అధికారి తనకు సరైన సమాధానం చెప్పాలంటూ సీతారాం పట్టుబట్టారు. ఎఒ మోహనరావు అక్కడికి వెళ్లి ఆమదాలవలస మండలానికి ఒకటి, రెండో విడతకు 654 మెట్రిక్ టన్నులు కేటాయించాల్సి ఉండగా, ఇప్పటికే 576 మెట్రిక్ టన్నులు యూరియా రైతు సేవా కేంద్రాలకు, 342 మెట్రిక్ టన్నులు ప్రైవేటుకు కేటాయించినట్లు తెలిపారు. దీంతో అక్కడి నుంచి తమ్మినేని తనయుడు తిరుగుముఖం పట్టారు. అనంతరం సీతారాం గూడ్స్ గొడౌన్ వద్దకు ఆయన స్వగృహం నుంచి కారులో వెళ్తున్న సమయంలో పట్టణంలోని గేటు ప్రాంతంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద సిఐ పి.సత్యనారాయణ, ఆమదాలవలస, సరుబుజ్జిలి బూర్జ ఎస్ఐలు కాంతారావు, హైమావతి, లావణ్యలు ఆయనను అడ్డుకున్నారు. పోలీసులతో సీతారాం వాదనలకు దిగినా... వాహనాన్ని ముందుకు కదలనివ్వకుండా పోలీసులు నిలువరించారు. దీంతో చేసేది లేక తమ్మినేని అక్కడ నుంచి వెనుతిరిగారు. ఇంటికి చేరుకున్న తమ్మినేని కారును ఇంటి వద్ద వదిలేసి ద్విచక్ర వాహనంపై పెద్ద చెరువు గట్టు వెంబడి మళ్లీ రైల్వే గూడ్స్ గొడౌన్ ప్రాంతానికి బయలు చేశారు. సిఐ సత్యనారాయణ పోలీసు సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహనంపై ఆయన వెంట వెళ్లి లెప్రసీ కాలనీ వద్ద నిలువరించారు ఆ సమయంలో పోలీసులకు తమ్మినేని ఆయన అనుచరులకు కొంతమేర వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీస్ జీపులో సీతారాంను ఎక్కించి ఇంటికి తరలించి గృహ నిర్బంధం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, అనీల్, బి.సూర్యారావు పాల్గొన్నారు.



సీతారాంను అరెస్టు చేస్తున్న పోలీసులు

శ్రమించారు.. సాధించారు

డిఎస్‌సిలో మెరిసిన అభ్యర్థులు

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

డిఎస్‌పి ఫలితాల్లో జిల్లా నుంచి అన్ని సబ్జెక్టుల్లో 37,982 మంది హాజరు కాగా, మెరిట్ లిస్టు ర్యాంకులు ఆధారంగా 458 మంది ఎంపికయ్యారు. వీరికి త్వరలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. టెట్, రాత పరీక్ష మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా మెరిట్ లిస్టు సిద్ధం చేశారు. ఈ డిఎస్‌సిలో ఎక్కువగా రైతు కుటుంబాల పిల్లలు మెరిసి కొలువులు సాధించి తమ కుటుంబాల్లో ఆనందం నింపారు. తల్లిదండ్రుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించడమే కాకుండా, పట్టుదలతో సాధిస్తే ఎవరైనా విజేతలవుతారని నిరూపించారు.

కవిటి మండలంలోని శిలగాంకు చెందిన పిరియా సురేంద్రబాబు ఈ విజయంలో ప్రత్యేక ఆకర్షణ. ఐదేళ్లుగా కష్టపడి చదివిన సురేంద్రబాబు ఫలితంగా ఒకేసారి మూడు విభాగాల్లో కొలువులు సాధించాడు. సోషల్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లాలో 4వ ర్యాంకు, సోషల్ టిజిటి జోనల్ 8వ ర్యాంకు, సోషల్ పిజిటి జోనల్ 7వ ర్యాంకు సాధించి శ్రమకు తగిన ఫలితం పొందాడు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన సురేంద్రబాబు తన తల్లిదండ్రులు చిన్నారావు, ప్రభావతి త్యాగానికి, భార్యా, పిల్లల సహకారానికి కృతజ్ఞతలు తెలిపాడు. ఆన్‌లైన్‌లో మురళీధర్, ఆఫ్‌లైన్‌లో శమల్ల రాజబాబు బెందాళం నీలాచలం వంటి గురువుల సహకారం ఈ విజయంలో కీలకమని సురేంద్రబాబు చెప్పాడు.

మరింత గర్వకారణం

మండలంలోని బైరిపురానికి చెందిన పిరియా షర్మిల 88.06 మార్కులతో ఎస్‌జిటిలో కొలువు సాధించింది. తల్లిదండ్రులు శంకరరావు, శ్రీదేవి రైతులు కావడంతో కృషికి ఇది ప్రతిఫలమని షర్మిల పేర్కొంది. కొండిపుట్టుగకు చెందిన తలగాన లోకనాథం సోషల్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 14వ ర్యాంకు సాధించాడు. లోకనాథం తండ్రి చంద్రయ్య రైతుల. లండారిపుట్టుగకు చెందిన నర్తు సుందరరావు గణితశాస్త్ర స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 6వ ర్యాంకు సాధించి గ్రామానికే గర్వకారణంగా నిలిచాడు. సుందరరావు తల్లిదండ్రులు సోమయ్య, బాలమ్మ వ్యసాయం చేసుకుంటూ చదివించారు. ఈ విజయాలతో రైతు కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. 'తాము కష్టపడి పిల్లలను చదివిస్తే వారు తమ నమ్మకాన్ని వమ్ము చేయలేదు' అనే సంతోషభాష్పాలు తల్లిదండ్రుల కళ్లలో మెరిశాయి. తమ పిల్లల విజయాలు ఆ పల్లెల బాటలో ఆశల దీపమై వెలిగాయి.

కంచిలి మండలానికి చెందిన నలుగురు అభ్యర్థులు జిల్లాస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. వీరంతా మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కావడంతో వారి కుటుంబాలతోపాటు గ్రామంలో ఆనందోత్సవాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని ముండల గ్రామానికి చెందిన సచిన్ కుమార్ మహంతి ఒకేసారి నాలుగు విభాగాల్లో ఉపాధ్యాయ ఉద్యోగానికి అర్హత సాధించారు. ఒరియా మీడియంలో ఎస్‌జిటి విభాగంలో జిల్లా ప్రథమ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రం విభాగంలోను జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకును సాధించాడు. అలాగే టిజిటి విభాగం లెక్కలు సబ్జెక్టులో జోన్ స్థాయిలో ఏడో ర్యాంకు, పిజిటి విభాగం భౌతికశాస్త్రంలో జోన్ స్థాయిలో రెండో ర్యాంకు సాధించాడు. డోలగోవిందపురానికి చెందిన దేభాశిష్ పోస్టుమాస్టరుగా విధులు నిర్వహిస్తూనే మెగా డిఎస్‌సి పరీక్షలు రాశాడు. ఈ ఫలితాల్లో ఒరియా ఎస్‌జిటి విభాగంలో జిల్లా స్థాయిలో ఏడో ర్యాంకు సాధించి ఉపాధ్యాయ పోస్టుకు అర్హత సాధించాడు. ఎం.ఎస్.పల్లికి చెందిన కప్ప దివ్య సైతం ఎస్‌జిటి విభాగంలో 26వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయులు పోస్టుకు అర్హత సాధించింది. కంచిలికి చెందిన ఎస్.సౌమ్య స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో జిల్లాస్థాయిలో 26వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయులుగా ఈ ఎంపికైంది. వీరందరికీ వారి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

సంతబొమ్మాళి మండలానికి చెందిన పలువురు అభ్యర్థులు ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించారు. బృందావనానికి చెందిన డొక్కరి వెంకటేష్ 89.29 మార్కులు సాధించి చిత్తూరు జిల్లాలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల కేటగిరీలో 12వ ర్యాంకు సాధించాడు. ఆయన విజయంపై తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, ముత్యాలు, మిత్రులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే గోదలంకు చెందిన పిలక శివాజీ, పాలినా లచ్చయ్యలు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. మరువాడకు చెందిన పలికిల మాధవరెడ్డి గణిత విభాగంలో 7వ ర్యాంకు సాధించి ఉద్యోగాలు పొందారు. మేఘవరానికి చెందిన డొంకాన భారతి ఎస్ఎ బయాలజీలో 15వ ర్యాంకుతో ఉద్యోగం సాధించారు. నౌపడ పంచాయతీ పాలవానిపేటకు చెందిన కొర్లాపు శ్రీనివాసరావు సోషల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు.

ఎచ్చెర్ల మండలం కొయ్యాం పంచాయతీ కొత్తకూర్మినాయుడుపేటకు చెందిన జీరు సత్యనారాయణ తెలుగు స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సత్తాచాటాడు. 90.02 మార్కులతో జిల్లాలో టాఫర్‌గా నిలిచారు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు, లక్ష్యంతో శ్రమించి ర్యాంకు సాధించినట్లు విజేత తెలిపాడు.

మెళియాపుట్టి మండలంలోని మారేడుకోటకు చెందిన మజ్జి శైలజ తెలుగు స్కూల్ అసిస్టెంట్‌లో జిల్లాలో ఐదో ర్యాంకు సాధించారు. ఆమెకు, తల్లిదండ్రులకు టిడిపి మాజీ మండల అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.



కంచిలి : దేభాసిష్‌కు స్వీట్ తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

నరసన్నపేట మండలంలోని మబగాంకు చెందిన ఎన్.విజయభాస్కర్ స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ విభాగంలో జిల్లా స్థాయిలో ఎనిమిదో ర్యాంకు, పిజిటిలో జోన్-1లో తొమ్మిదో ర్యాంకు సాధించారు. డిఎస్‌సి ర్యాంకు సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పలాస మండలం బొడ్డపాడు సచివాలయంలో కార్యదర్శిగా పనిచేస్తున్న కింతల రవికుమార్ డిఎస్‌పి ఫలితాల్లో బయాలజీలో తొమ్మిదో ర్యాంకు సాధించారు. బొడ్డపాడుకు చెందిన ఎరుమాకు భార్గవ్ పిఇటి, సంక కృష్ణప్రసాద్ సెకండ్ గ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యారు. అలాగే హారిక 12వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైంది.

సోంపేట మండలం నుంచి ముగ్గురు అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధించారు. పలాసపురానికి చెందిన దుద్ది సంధ్య ఎస్‌జిటి విభాగంలో ఆరు, బీన సురేష్ స్కూల్ అసిస్టెంట్ లెక్కలు విభాగంలో జిల్లాస్థాయిలో పదహారవ ర్యాంకులు సాధించారు. సంధ్య తండ్రి వరప్రసాద్, తల్లి రమ వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. గత డిఎస్‌సిలో సంధ్య సోదరి చాందిని ఉపాధ్యాయులుగా ఎంపికైంది. జగతికేశపురానికి చెందిన కడగల దేవి ఎస్‌జిటి విభాగంలో 19వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయ పోస్టుకు అర్హత సాధించింది. వీరందరికీ వారి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

బూర్జ మండలంలో గోవిందరావు సత్తా చాటాడు. అన్నంపేట గ్రామానికి చెందిన గోవిందరావు మెగా డిఎస్‌సిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో ఎంపికయ్యారు. 85.43 టాపర్‌గా నిలిచాడు. ఈయనను గ్రామస్తులు అభినందించారు.

లావేరు మండలం తాళ్లవలసలకు చెందిన చెందిన పిసిని దేవి వరప్రసాద్ స్కూల్ అసిస్టెంట్ విభాగం బయాలజీ సబ్జెక్టులో జిల్లాస్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. దీంతో తల్లిదండ్రులు సూర్యప్రకాష్, లక్ష్మి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అభినందనలు తెలిపారు.

పొందూరు మండలం తోలాపికి చెందిన అన్నెపు శేషాద్రినాయుడు ఎస్‌జిటి విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచాడు. 96.4017 మార్కులు సాధించాడు. తల్లిదండ్రులు ధర్మారావు, జగదాంబలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

దాపరికానికి తాపత్రయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

యూరియా కొరత సమస్యను పరిష్కరించడం కంటే దానిని దాచేందుకే ఎక్కువగా ప్రయత్నిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, అధికారులు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. యూరియా దొరక్క రైతులు గగ్గోలు పెడుతుంటే ఏమీ లేదనట్లుగా ప్రకటనలు గుప్పిస్తున్నారు. బూర్జ మండలంలో శనివారం చోటు చేసుకున్న ఘటన జిల్లాలో ఎరువుల కొరత తీవ్రతకు అద్దం పడుతోంది. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ దుకాణానికి 120 బస్తాల యూరియా వస్తే పంపిణీ చేయలేక అధికారులు చేతులెత్తిన పరిస్థితి వచ్చింది. యూరియా కోసం కళ్లు కాయాలు కాసేలా ఎదురుచూస్తున్న రైతులకు యూరియా వచ్చిందంటూ సమాచారం తెలియడంతో ఉన్నపళంగా ప్రైవేట్ దుకాణం ముందు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వాలిపోయారు. తిండితిప్పలు మానేసి ఉదయం 12 గంటల నుంచి పడిగాపులు కాశారు. పంపిణీ పర్యవేక్షణకు మధ్యాహ్నం మూడున్నర గంటల సమయానికి అక్కడకు చేరుకున్న తహశీల్దార్ వై.వి.పద్మావతి, మండల వ్యవసాయశాఖ అధికారి డి.ఉషారాణి అక్కడ పరిస్థితిని చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. తోపులాటలను పోలీసులు నియంత్రించలేకపోవడంతో చేసేది ఏమీ లేక పంపిణీని ఆపేయాల్సిన పరిస్థితి తలెత్తింది. రైతులకు కూపన్లు ఇచ్చి సోమవారం యూరియా అందిస్తామంటూ వాయిదా వేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ ఎఒని రైతులు నిలదీసిన సందర్భంగా చేసిన ఆరోపణలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. తమకు ఒక్క బస్తా యూరియా ఇవ్వకుండా తమ పేరుతో వేరే వారికి ఇచ్చేశారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. తమ మండలంలోని రైతులకు అందివ్వాల్సిన ఎరువులను ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారంటూ కూడా ఆరోపించారు.

రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, సహకార సొసైటీలు, రైతు ఉత్పత్తి సంఘాలు తదితర సంఘాల ద్వారా చేపట్టిన ఎరువుల పంపిణీ సక్రమంగా జరగలేదని తెలుస్తోంది. ఏ కేంద్రంలో ఎంత మందికి రైతులకు ఎంత పరిమాణంలో ఇచ్చారో లెక్కాపత్రం లేకుండా పోయింది. ఈ-పోస్ యంత్రాల ద్వారా యూరియా పంపిణీ చేయాల్సి ఉన్నా చాలాచోట్ల వాటిని పక్కన పెట్టేశారు. జిల్లాలో 150 పంపిణీ కేంద్రాల్లో ఈ-పోస్ యంత్రాలు కూడా లేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గ్రామాల్లో పాలన, ప్రభుత్వ కార్యక్రమాలు అన్నీ కూటమి నాయకులు ముఖ్యంగా టిడిపి నేతల కనుసన్నల్లో జరుగుతోందనేది ఎవరూ కాదనలేని నిజం. ఎరువుల పంపిణీ విషయంలోనూ వారే మాటే చెల్లుబాటు అయింది. టిడిపి నాయనకులు, వారి సిఫార్సు చేసిన వారికే కావాల్సినంత యూరియా అందినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామాలకు వచ్చిన యూరియా వచ్చినట్లుగానే తరలిపోవడంతో సామాన్య రైతులకు ఒక్క బస్తా కూడా దొరకని పరిస్థితి తలెత్తింది. అంతా నాయకులకే ఇచ్చేస్తే రైతుల ఆగ్రహాన్ని చూడాల్సి వస్తుందని గుర్తించిన అధికారులు అక్కడక్కడ ఒకటి అరా బస్తాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న యూరియా తమకు ఇక దక్కే పరిస్థితి లేదని గ్రహించిన రైతులు ప్రైవేట్ దుకాణాల వైపు పరుగులు తీశారు. ఇదే అదనుగా వ్యాపారులు సాధారణ ధరపై రూ.300 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. బస్తా యూరియాను ప్రభుత్వం రూ.275కు అందిస్తుండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.500కు యూరియాని విక్రయిస్తున్నారు. అదేవిధంగా డిఎపి ప్రభుత్వం రూ.1350కి విక్రయిస్తుండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.1600 పైబడి అమ్ముతున్నారు. ఇదే అదనుగా వారు అందినకాడికి దోచుకుంటున్నారు. బూర్జ మండలం బూర్జ, కొల్లివలస, గుత్తావిల్లి తదితర ప్రాంతాల్లో యూరియా కావాలంటే పురుగు మందులు కొనాల్సిందేనంటూ షరత్తులు పెడుతున్నారు. రూ.400 నుంచి రూ.500 విలువ గల పురుగుమందు డబ్బాలను వ్యాపారులు రైతులకు అంటగడుతున్నారు.

మరోవైపు జిల్లా అవసరాలకు సరిపడా యూరియా నిల్వలను పంపిణీ చేయకుండా ప్రభుత్వం రైతులను మరింత అవస్థలకు గురి చేసింది. ఖరీఫ్ మొత్తానికి 42,225 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం అందులో కోత పెట్టి జిల్లాకు 21,644 మెట్రిక్ టన్నులు కేటాయించింది. జూలై కోటా కింద విడుదల కావాల్సిన 9,600 మెట్రిక్ టన్నుల యూరియాలో 4 వేలు టన్నులు మాత్రమే వచ్చాయి. ఆగస్టు నెలకు సంబంధించి ప్రభుత్వం 12 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,500 మెట్రిక్ టన్నులు పంపింది. అందులో ప్రైవేట్ డీలర్లకు 50 శాతం, మిగిలిన సగం నిల్వలు పిఎసిఎస్‌లు, డిసిఎంఎస్‌లు, రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేశారు. ప్రభుత్వ కేంద్రాలకు వచ్చిన యూరియాను టిడిపి నాయకులు తమ అవసరాలకు వారు తీసుకువెళ్లిపోవడంతో గ్రామాల్లోని మిగిలిన రైతులంతా ప్రైవేట్ దుకాణాలపై ఆధారపడాల్సి వచ్చింది. ఇదే అదనుగా ప్రైవేట్ డీలర్లు అదనపు ధరలు వసూలు చేస్తూ రైతులను నిలువ దోపిడీ చేస్తున్నారు. క్షేత్రస్థాయి ఈ రకమైన పరిస్థితులను చక్కదిద్దాల్సిన ప్రభుత్వం, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు యూరియా కొరత లేదని, ఏదైనా ఉంటే అది అధికారుల నిర్వహణ తీరు వల్లేనంటూ సమస్యను అధికారులపైకి నెట్టేసే ప్రయత్నం చేయడంపై రైతులు మండిపడుతున్నారు. సమస్యను దాచేందుకు తాపత్రయపడటం కంటే యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్న రైతులకు సాయపడాలని అంతా కోరుతున్నారు.

శ్రీకాకుళం నగరపాలక సంస్థ - శ్రీకాకుళం

ఆర్.ఓ.సి.నెం.102654/2019/A2, తేది.23-08-2025

బహిరంగ వేలం ప్రకటన

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో మార్కెట్ మరియు రోడ్ మార్జిన్స్ లలో 2025-2026 ఆర్థిక సంవత్సరమునకు గానూ, ఖాళీ షాప్ రూములకువాటికి ఎదురుగా చూపబడిన కాలములకు లీజుకు ఇచ్చు విషయములో నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో కమిషనర్ వారిచే గాని లేదా వారి వలన అధికారము పొందబడిన వారి చేతనైనను తేది:30-08-2025న శనివారము ఉదయం 11.00 గంటలకు ప్రారంబించబడిబహిరంగ వేలం నిర్వహించబడును. అవసరమైనచో ఆ తరువాత దినముల యందు బహిరంగ వేలము కొనసాగును.

వ.నెం	వివరములు	కాల పరిమితి	నెలసరి అద్దె	చెల్లించవలసిన ధరావత్తు	దాఖలు చేయవలసిన సాల్వెన్సీ	వేలం తేది
	శ్రీ పొట్టి శ్రీరాములు మునిసిపల్ మార్కెట్ గ్రౌండ్ ఫ్లోర్ నందు గల ఖాళీగా ఉన్న 23 షాపులు బి బ్లాకు షాపు నెం. 27 = 01 సి బ్లాకు మెట్లు గది & C-45, C-47 = 03 ఇ&ఫ్ బ్లాకు మెట్లు గది (EF) 82,86 = 01 ఒ.ఎస్ -1 నుండి 15 వరకు మరియు TS-14 = 16	లీజు కిచ్చిన తేది నుండి 3 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.50,000/-	రూ.5,00,000/-	వేలం తేది.. 30-08-2025 ఉదయం 11.00 గంటల నుండి
1	పొట్టి శ్రీరాములు మునిసిపల్ మార్కెట్ మొదటి అంతస్తు నందు గల ఖాళీగా ఉన్న 42 షాప్ రూములకు ఎ బ్లాక్ - 01 నుంచి 11 & 13,15,16 =14 బి బ్లాక్ - 21,22,23 24, 28, 29 & 31, 34 = 08 సి బ్లాక్ - 42 నుంచి 49 = 08 డి బ్లాక్ - 51 నుంచి 61 & 64 నుంచి 68 =17 మొత్తము = 69	లీజు కిచ్చిన తేది నుండి 3 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	
	పై షాప్ రుములలో మొదట అంతస్తు ఎస్.సి (S.C) లకు ఎ బ్లాక్ లో13&1,3,4,5,6,8,10,11 బి బ్లాక్ లో షాప్ నెం.34 & 28,29 సి బ్లాక్ లో షాప్ నెం. 48&43,44,45 డి బ్లాక్ లో షాప్ నెం. 66,67&,51,52,57,61,64 ఎస్.టి (S.T) లకు-ఎ బ్లాక్ లో షాప్ నెం. 16&7,9,15 బి బ్లాక్ లో షాప్ నెం - 31 సి బ్లాక్ లో షాప్ నెం - 46&49 డి బ్లాక్ లో షాప్ నెం : 54,55,56 నాయ బ్రహ్మణులు మరియు రజకులకు ఎ బ్లాక్ లో షాప్ నెం: 2 బి బ్లాక్ లో షాప్ నెం: 22 సి బ్లాక్ లో షాప్ నెం. 47 డి బ్లాక్ లో షాప్ నెం. 53,58,59,60,65 వికలాంగుల (P/H) కేటగిరి : గ్రౌండ్ ఫ్లోర్ నందు గల షాప్ నెం C మెట్ల గది. D మెట్ల గది E/F మెట్ల గది					వేలం తేది.. 30-08-2025 ఉదయం 11.00 గంటల నుండి
2	శ్రీ పొట్టి శ్రీ రాములు మునిసిపల్ మార్కెట్ నందు గల E&F బ్లాక్ మొదటి అంతస్తు పై గల ఓపెన్ ఏరియా 40.00x28.00 చ.అ-1 40.00x28.00 చ.అ-2	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.1,50,000/-	రూ.10,00,000/-	
3	Opp N.T.R M.H SCHOOL వద్ద గల షాపు నెంబర్లు- 21,22,25,27,28,29 పై షాపు రూములలో జనరల్ కేటగిరి కి చెందిన షాప్ నెం-22,29=02 S.C లకు షాపు నెం -,25,27,28 = 03 S.t లకు షాపు నెం - 21 = 01 మొత్తం = 06	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.5,00,000/-	
4	గాంధీ పార్క్ జంక్షన్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాప్ నెం : 22, 23 పై షాప్ రూములలో SC కేటగిరికి షాప్ నెం-22. రజక / నాయి బ్రాహ్మణ షాప్ నెం - 23 మొత్తం = 02	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.1,00,000/-	
5	శ్రీ పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద గల మొదటి అంతస్తు నందు గల ఖాళీగా ఉన్న షాప్ రూములకు షాపు నెం. 01 నుండి 06 మరియు 8 నుండి 10 = 09 పై షాపు రూములలో S.C లకు షాపు నెం, 1,2,4,6, 9 S.T లకు షాపు నెం- 3,8 మరియు నాయ బ్రహ్మణులు షాపు నెం : 5 గలవి		హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	వేలం తేది.. 30-08-2025 ఉదయం 11.00 గంటల నుండి
6	శ్రీ పొట్టి శ్రీరాములు మునిసిపల్ మార్కెట్ నాగావళి కృష్ణ లైన్ నందలి గ్రౌండ్ ఫ్లోర్ నందు వికలాంగుల కేటగిరికి చెందిన మెట్లగది మొదటి అంతస్థు నందు గల ఖాళీగా ఉన్న 10 షాప్ రూములు.పై షాపు రూములలో S.C లకు షాపు నెం-, 1,2,4,6, & 8 S.T లకు షాపు నెం- 3,7 &10 మరియు నాయ బ్రహ్మణులు షాపు నెం : 9	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	
7	నానుబాల వీధి షాపింగ్ కాంప్లెక్స్, షాపు నెం: 01, 2,&6 = 3 షాపులు పై షాప్ రుములలో ఎస్.సి (S.C) లకు షాప్ నెం: 6 రజక/నాయిబ్రాహ్మణ లకు - షాప్ నెం: 1 వికలాంగుల కు షాప్ నెం: 02		హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	
8	మేదర వీధి షాపింగ్ కాంప్లెక్స్ నందలి (మొదటి అంతస్తు) నందలి షాపు నెం-1 నుండి4& 6 నుండి 10షాపులు = 9 షాపులు SC కేటగిరి కి షాప్ నెం - 1,10, ST కేటగిరి కి షాప్ నెం - 3,7 P/H కేటగిరి కి షాప్ నెం - 4, రజక/నాయిబ్రాహ్మణ లకు - షాప్ నెం: 2,6,8,9	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.30,000/-	రూ.3,00,000/-	వేలం తేది.. 30-08-2025 ఉదయం 11.00 గంటల నుండి
9	పాలకొండ రోడ్ షాపింగ్ కాంప్లెక్స్ (Opp-Police station) నందలి జనరల్ కేటగిరికి చెందిన షాపు నెం- 2 & 5, 6 = 3 షాపులు		హెచ్చు పాట	రూ.50,000/-	రూ.5,00,000/-	
10	OPP మునిసిపల్ ఆఫీస్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి స్టాల్ నెం - 7,9,10,12&13 = 06 షాపులు పై షాప్ రుములలో, ఎస్.సి (S.C) లకు స్టాల్ నెం: 13 ఎస్.టి (S.T) లకు - స్టాల్ నెం : 09		హెచ్చు పాట	రూ.60,000/-	రూ.10,00,000/-	
11	మునిసిపల్ ఆఫీస్ బ్యాక్ సైడ్ షాపింగ్ కాంప్లెక్స్ నందలి షాపు నెం-6 వరకు = 01 షాపులు	లీజు కిచ్చిన తేది నుండి 3 సంవత్సరములు	హెచ్చు పాట	రూ.50,000/-	రూ.5,00,000/-	

షరతులు:-

1. టెండర్ కం వేలం పాటలో పాల్గొన దలచిన వారు వేలం పాట మొదలు పెట్టే ముందర డిపాజిట్ చెల్లించి తేది:29.08.2025. తారీఖు సాయంత్రం గం 5.00 లోపు పొందిన సాల్వెన్సీ సర్టిఫికేట్ తో పాటు ఒరిజినల్ ఇ.సి దాఖలు చేసి వేలం పాటలో పాల్గొనవలసినదిగా తెలియజేయడమైనది.
2. ప్రభుత్వ ఉత్తర్వులు G.O.MS.No.56, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్మెంట్ (J1) తేది : 05-02-2011 నకు లోబడి షరతులు వర్తించును.
3. నగరపాలక సంస్థ నకు చెందిన ఖాళిగా ఉన్న షాపులుపూర్తి వివరముల కొరకు కార్యాలయ పని చేయు వేళలో రెవిన్యూ సెక్షన్ ను సంప్రదించగలరు.

సం / పి.వి.వి.డి. ప్రసాద్ రావు
కమీషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ.


రికార్డులను పరిశీలిస్తున్న డివిఇఒ సురేష్‌కుమార్

ముఖ హాజరు తప్పనిసరి

జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి సురేష్‌కుమార్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అధ్యాపకులు ఉదయం 9, సాయంత్రం 5 గంటలకు ముఖ హాజరు తప్పనిసరిగా వేయాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎ.సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం సందర్శించారు. ఈ మేరకు కళాశాల రికార్డులు, అధ్యాపకుల టీచింగ్ డైరీ, నోట్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలకు సమయానికి హాజరుకావాలని, ఇంటర్ బోర్డు ఇచ్చిన ఆదేశాలు మేరకు పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఈ సంవత్సరం కొత్తగా ప్రవేశపెట్టిన ఎంసెట్. నీట్ విద్యార్థులకు తరగతులు పక్కాగా బోధించి వారం వారం పరీక్షలు పెట్టాలని అన్నారు. అనంతరం ప్రయోగశాలలను పరిశీలించి ఎప్పటికప్పుడు విద్యార్థులకు చెప్పాలని అన్నారు. ఆయనతో పాటు కాళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌నాయక్, అధ్యాపకులు కేశవరావు, జాన్సీ, రాంబాబు, రమణ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

బాధ్యతగా పనిచేయాలి

పలాస : తాను ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో కూటమి నాయకులు కార్యకర్తలు బాధ్యతగా పని చేసి తనను గెలిపించారని, మరెంత బాధ్యతగా పని చేస్తే పార్టీ బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం నాయకులతో, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో సంస్థాగత ఎన్నికలు రానున్నాయని, అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, కొరికాన శంకర్ పాల్గొన్నారు.


బాక్సులో టిఫిన్ పెట్టి ఇస్తున్న సురేష్

ఇక్కడ ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం నగరంలోని తుమ్మలవీధిలో మొక్క సురేష్ జైసత్తెమ్మ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. పక్కాగా ప్లాస్టిక్ నిషేధం పాటిస్తున్నాడు. ఇక్కడ ప్లాస్టిక్ వినియోగం కనిపించదు. పార్శిల్ కోసం వచ్చిన వారు సైతం స్టీల్‌బాక్సు తెచ్చుకుంటేనే టిఫిన్ ఇస్తాడు. మరోపక్క ప్లాస్టిక్ వలన అనర్థాలను తెలియ జేస్తున్నారు. 300 ఏళ్లైనా ప్లాస్టిక్ భూమిలో కరగదని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు సైతం ప్లాస్టిక్ వినియోగించవద్దని సూచిస్తున్నారు. శ్రీకాకుళం నగర పాలక సంస్థ సైతం ప్లాస్టిక్ నిషేదం అమలు చేసి, అవగాహన కల్పిస్తుంది. అంచెలంచెలగా ఈ నిషేదం అమలు చేస్తున్నారు. ఈయన అమలు చేస్తున్న ఆదర్శం అందరిని ఆకట్టుకుంటుంది.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

ఘనంగా సూర శ్రీను జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రముఖ వ్యాపారవేత్త, ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ సూర శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న క్రిస్టల్ ప్యాలెస్‌లో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని బెహర మనో వికాస కేంద్రంలో అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు దేవాలయాల్లోనూ, క్రిస్టల్ ప్యాలెస్‌లో ముస్లీం, క్రైస్తవ సోదరులు కలిసి సర్వమత ప్రార్ధనలు చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. నగరంలోని యువత పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో మొక్కలను నాటారు. వెయ్యి మంది మహిళలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు విస్తరించనున్నట్టు చెప్పారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

ప్రజాశక్తి- లావేరు

ఉద్యోగులకు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని ఎంపిపి ప్రతినిధి ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఇటీవల ఇఒపిఆర్‌డిగా పనిచేసి విజయనగరం జిల్లా చీపురుపల్లి ఎంపిడిఒగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన వి.విశ్వేశ్వరరావును ఘనంగా సన్మానించారు. అలాగే బదిలీపై వెళ్లిన పలువురు కార్యదర్శులను సన్మానించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మండల అధికారిగా మంచి సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకటరాజు, సర్పంచ్‌లు దేశెట్టి తిరుపతిరావు, షేక్ ఛాన్ బాషా, కలిశెట్టి భాస్కరరావు, ఎంపిటిసిలు, గుమ్మాడం కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విశ్వేశ్వరరావును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇంటింటికీ కలెక్టర్

'అన్నదాత సుఖీభవ' ప్రయోజనం అందరికీ చేరేలా చర్యలు

ప్రజాశక్తి- మందస

ప్రభుత్వం అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకంలో ఒక్క లబ్ధిదారుడు మినహాయింపు కాకుండా అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మందస మండలం సువర్ణపురంలో శనివారం ఆయన క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. గ్రామంలోని పలువురు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి వారు పథకం కింద డబ్బులు అందుకున్నారా లేదా ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఎవరైనా లబ్ధిదారు డబ్బులు పొందకపోతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. 'పథకం అమలులో ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ కఠినంగా ఉండాలి' అని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రైతులు పథకంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ స్వయంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు తెలుసుకోవడంతో వారంతా ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. పర్యటనలో కలెక్టర్ పలువురు విద్యార్థులతో ముచ్చటించారు. వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పలు


మందస : విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, తహశీల్దార్ శ్రీకాంత్ ఉన్నారు.

శివారు భూములకు సాగునీరు

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అంతరకుడ్డ సమీపంలో ఉన్న వంశధార కాలువను శనివారం వంశధార అధికారులతో కలిసి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండరీకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధార నీరు ఎక్కడి వరకు వచ్చింది, శివారు ప్రాంతానికి వంశధార వెళ్ళాలంటే ఎన్ని క్యూసెక్కులు అవుసరం, ఇంకా ఎన్ని చెరువులు నిండాల్సి ఉంది తదితర అంశాలను వంశధార ఇఇ శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. టెక్కలి వరకు సుమారు 400 క్యూసెక్కులు నీరు వచ్చిందని, పలాస మండలం విషయానికి వస్తే ఈదురాపల్లి 68టి వరకు సుమారు 22 క్యూసెక్కులు నీరు వచ్చిందని చెప్పారు. శివారు ప్రాంతాలకు నీరు వెళ్ళాలంటే మరో 20 క్యూసెక్కులు అవసరం ఉందని అన్నారు. వజ్రపుకొత్తూరు మండలంలో మరో ఆరు చెరువులు నింపాల్సి కలెక్టర్‌కు వివరించారు. రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు వహించి సాగునీరు అందించాలన్నారు. ఆయనతో పాటు వంశధార అధికారులు రాజశేఖర్, మీనాక్షి, నీటి సంఘం అధ్యక్షుడు గొనప నిరంజన్, టిడిపి నాయకులు బి.నాగరాజు రైతులు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలోని పాలవలసలో నిర్వహించిన స్వచ్ఛాంధ్రాలో కలెక్టర్ పాల్గొన్నారు. రెండు ఇళ్లకు స్వయంగా వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. డస్ట్ బిన్లను వేర్వేరుగా వాడకంపై అవగాహన కల్పించారు. చెత్త సేకరించే శ్రామికుడితో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు.


ప్రమాదంలో గాయపడిన రాజశేఖర్

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- పొందూరు

మండలం గోరింట గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రగాయాలకు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు పెనుబర్తి పంచాయతీ ఐఆర్.పురం కాలనీకి చెందిన మడపాన రాజశేఖర్ ద్విచక్ర వాహనంపై గోరింట వైపు వెళ్తుండగా పొందూరు నుంచి వస్తున్న ఆటో బలంగా ఢీకొంది. దీంతో రాజగోపాల్ తలకు తీవ్రగాయాలు కావడంతో పాటు కాళ్లు, చేతులు విరిగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. దీంతో సమీపంలో ఉన్నవారు అంబులెన్సు వాహనంలో శ్రీకాకుళంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాల పాలైన రాజశేఖర్ వైద్యచికిత్సకు రూ.10 లక్షలు వరకూ ఖర్చు వుతుందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. బిఎస్‌సి చదువుతున్న రాజశేఖర్ తల్లిదండ్రులు రోజుకూలీలు కావడంతో వైద్యఖర్చులపై తీవ్ర ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటేష్‌కు బంగారు పతకం

పలాస : పలాస-కాశీబుగ్గకు చెందిన న్యాయవాది నారా వెంకటేష్‌కు జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ నెల 18 జంషెడ్‌లో నిర్వహించిన జాతీయ సీనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలో పాల్గొన్నారు. 20 రాష్ట్రాల నుంచి 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా నుంచి వెంకటేష్ పాల్గొన్నారు. 120 కిలోల విభాగంలో మొత్తం 500 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానం సాధించారు. ప్రస్తుతం ఈయన చిన్నబడాంలో నివాసం ఉంటూ పలాస లో న్యాయవాది వృత్తిలో స్థిరపడ్డారు. వెంకటేష్ గోల్డ్ మెడల్ రావడంపై బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.


గోల్డ్ మెడల్ సాధించిన వెంకటేష్

శివకుమార్‌కు...

సోంపేట : జంషెడ్పూర్‌లో ఈ నెల 18 నుంచి 21 వరకు నిర్వహించిన సీనియర్ నేషనల్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సోంపేటకు చెందిన కాశి శివకుమార్ జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించాడు. జాతియా స్థాయిలో గ్రామానికి ఖ్యాతి తెచ్చిన శివకుమార్‌కు స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలు అభినందనలు తెలియజేశారు.

నాపై తప్పుడు ఆరోపణలు

శ్రీకాకుళం సిటీ: తనపై తప్పుడు ఆరోపణలు సరికాదని పొందూరు నుంచి కంచిలికి బదిలీ అయిన కెజిబివి ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య అన్నారు. నగరంలోని తన ఇంటి వద్ద శనివారం విలేకరులతో మాట్లాడారు. ఉద్దేశ పూర్వకంగా వ్యక్తిగత కక్ష, రాజకీయ కోణంలో బదిలీ చేశారన్నారు. తాను ఎప్పుడూ సస్పెండ్ కాలేదని, మెడికల్ లీవ్‌లు మాత్రమే పెట్టానన్నారు. తనపై సిట్ నియమించి విచారణ నిర్వహించినా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తాను విధి నిర్వహణలో ఎటువంటి అధికార దుర్వినియోగానికి పాల్పడలేదని చెప్పారు. ఒంటరి మహిళను అన్యాయంగా కంచిలి బదిలీ చేశారన్నారు.

రేపు పెన్షనర్ల ధర్నా

ఆమదాలవలస : ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమంలో పెన్షనర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురవరపు సిమ్మినాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పెన్షనర్ల వ్యతిరేక విధానాలపైన, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానాల ప్రకారం 12వ పి.ఆర్.సి వెంటనే నియమించాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని తదితర డిమాండ్లు కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమాన్ని పెన్షనర్లంతా పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం సిటీ: జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలతో జిల్లాలోని యువతను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీలుగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల విస్తరణకు రూపొందించిన ర్యాంపు పథకం ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జిఎం శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రెడ్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పరిశ్రమల వ్యవస్థాపకత వృత్తి నైపుణ్యంపై పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, ఆముదాలవలస, రణస్థలంలో నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందని, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు అర్హులని తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌ఫోటోలను జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయానికి అందజేసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

అంగన్వాడీల వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎచ్చెర్లలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి వెట్టిచాకరి చేస్తున్నారని అన్నారు. అలాగే ఇటీవల కాలంలో పనిభారం పెరిగిందన్నారు. 42 రోజులు చారిత్రాత్మక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, ఇంతవరకు కూటమి ప్రభుత్వం దాని గురించి పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు డిఎ, పిఆర్‌సి అమలు చేయాలన్నారు. అలాగే సంక్షేమ పథకాలు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటరు నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణట్రాకర్, బాల సజీవిని యాప్ అమలుకు సపోర్ట్ చేయడం లేదని అన్నారు. లబ్ధిదారులకు ఫొటో క్యాప్చర్, ఒటిపి, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయడానికి అంగన్వాడీలు అనేక


మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎఫ్ఆర్ఎస్ ఇన్, అవుట్ రద్దు చేయాలన్నారు. ఆన్‌లైన్ వర్క్‌కు ఒక యాప్ మాత్రమే ఉండాలన్నారు. సెంటర్ నిర్వహణకు నాణ్యమైన ట్యాబ్‌లు ఇవ్వాలన్నారు. 5జి నెట్ ఇవ్వాలని కోరారు. ప్రధానమంత్రి మాతృ వందనం పథకాన్ని కొత్తగా అంగన్వాడీలు అప్పగించరాదన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. గ్రాట్యూటీ జీవోలో మార్పులు చేయాలన్నారు. హెల్పర్ల ఉద్యోగోన్నతులకు విధి విధానాలు రూపొందించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.విజయలక్ష్మి, చంద్రమౌళి, శారద, రాములమ్మ, రాధిక, ధనలక్ష్మి, కనకం, లలిత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీ కిరణకుమార్

తేనెటీగల పెంపకంతో అదనపు ఆదాయం

డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్

ప్రజాశక్తి- కవిటి

పచ్చని ఉద్యానవనం ఉద్దానం ప్రాంతంలో తేనెటీగల పెంపకం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందాలని డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో తేనెటీగల పెంపకంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తోటల్లో తమ పంటలు పండించుకుంటూనే తేనెటీగల పెంపకం ద్వారా ఆదాయం సంపాదించుకోవచ్చునని అన్నారు. దానికి హంబుల్ బి కంపెనీ సహకరిస్తున్నట్టు తెలిపారు. హంబుల్ బి ప్రతినిధి ఎ.ప్రభాకర్ మాట్లాడుతూ కర్ణాటక, ఉత్తరప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాల్లో తమ కంపెనీ తేనెటీగల పెంపకం ద్వారా రైతులకు ఆదాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 250 మంది రైతులకు తేనెటీగల పెంపకం ద్వారా ఆదాయం కల్పించేందుకు లక్ష్యంగా ఏర్పరచుకున్నట్టు పేర్కొన్నారు. రూ.82,500 చెల్లిస్తే 10 తేనెటీగలతో పాటు పది తేని పెట్టెలు, 13 రకాల పనిముట్లు అందించనున్నట్లు తెలిపారు. డిపిఎం ఎల్.హెచ్.నారాయణరావు మాట్లాడుతూ తేనెటీగల పెంపకంపై కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల రైతులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. తేనెటీగల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులకు ఎఫ్‌పిఒల ద్వారా రుణాలు అందించి ప్రోత్సహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్‌టిఒ అధ్యక్షులు ఆరంగి అనీల్‌కుమార్, ఎఫ్‌పిఒ ఎపిఎం ఈశ్వర రావు, ఎపిఎంలు గోవిందరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు అమానుషం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎటువంటి జీవనాధారం లేక, ఏ పని చేయలేక ప్రభుత్వ సంక్షేమ పథకం ద్వారా జీవనం సాగిస్తున్న వికలాంగుల పింఛన్‌ను అకస్మాత్తుగా తొలగించి వారిని రోడ్డున పడేయడం అమానుషమని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో నున్న వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో దాదాపు 450 మంది వికలాంగుల పింఛన్లను తొలగించారని, ఇందులో ఎంతోమంది గత 20 ఏళ్లుగా వికలాంగ కేటగిరిలో పింఛను పొందుతున్నారని, వారి పింఛను ఆపేయడం అమానుషమన్నారు. పింఛన్లు పోయిన వారు మరలా సంబంధిత మున్సిపల్ కమిషనర్, ఎంపిడిఒలకు అప్పీలు చేయాలని అప్పటికీ న్యాయం జరగకపోతే కోర్టుకు వెళ్లి


మాట్లాడుతున్న రవికుమార్

న్యాయం జరిగేలా పార్టీ తరపున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, వైసిపి జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, జిల్లా ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు కొప్పుల ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, వైసిపి నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీలో వివక్ష చూపొద్దు

ఇచ్ఛాపురం: మండలంలో ఎరువుల పంపిణీలో ఎటువంటి వివక్షత లేకుండా రైతులు అందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులకు ఆదేశించారు. స్థానిక వైసిపి కార్యాలయంలోమ వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఎరువులు సక్రమంగా అందించాలని, శివారు పొలాలకు సాగునీరు అందించాలని అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర బిసి కార్యదర్శి నర్తు


మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

నరేంద్ర యాదవ్, ఎంపిపి బోర పుష్ప, వైసిపి నేతలు నర్తు వరప్రసాద్, పి.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

బైకుల చోరీ నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి, మండలంలో రెండు బైకులు చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి, బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో శనివారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. మండలంలోని గరుడఖండికి చెందిన కవిటి నిఖిలాస్, ఒడిశా గజపతి జిల్లా కాశీనగర్‌కు చెందిన తూముల కార్తీకేయలను అరెస్టు చేశామన్నారు. టెక్కలిపట్నం గ్రామానికి చెందిన దొర సురేష్ తన ద్వీచక్ర వాహనాన్ని ఇంటి బయట పెట్టి రాత్రి ఉంచి నిద్రించగా చోరీకి గురయ్యిందన్నారు. గార మండలం మండపేటకు చెందిన మండ ఢిల్లేశ్వరరావు కాశీబుగ్గ మల్లేశ్వరరావు ఆస్పత్రి వద్ద తన ద్వీచక్ర వాహనం ఉంచి తన పనులు ముగించుకొని వచ్చారని అన్నారు. అక్కడ తన వాహనం చోరీకి గురి కావడంతో కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు దర్యాప్తు చేయగా చోరీ చేసిన వాహనాలను విశాఖలో విక్రయించేందుకు వెళ్తున్న ఇద్దరు నిందితులను పట్టుకొని వారిని అరెస్టు చేసి, వాహనాలను స్వాధీం చేసుకున్నామని తెలిపారు. నిందితులు శ్రీకాకుళంలో పదో తరగతి వరకు కలిసి చదువకుని స్నేహితులుగా మారారని అన్నారు. ఇద్దరూ చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు ప్రారంభించారని చెప్పారు. మొదటిగా విశాలో వీరు చోరీలు ప్రారంభించి, కాశీబుగ్గలో రెండు ద్వీచక్ర వాహనాలు చోరీ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా యువత బెట్టింగ్, గంజాయి వంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు మరింతగా అప్రమత్తంగా ఉండి వారిని పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఆయనతో పాటు సిఐ పి.సూర్య నారాయణ, క్రైం కానిస్టేబుల్ గవరయ్య ఉన్నారు.


సాయిదీపక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవోదయకు సాయిదీపక్ ఎంపిక

రణస్థలం: జవహర్ నవోదయ విద్యాలయ సమితి నిర్వహించిన నవోదయ పాఠశాల ప్రవేశ పరీక్షలో 8వ తరగతిలో సీటు కైవసం చేసుకున్న కోష్ట శ్రీ నారాయణ స్కూల్ విద్యార్థి కోనేటి సాయి దీపక్‌ను మండల విద్యాశాఖాధికారి ఎ.త్రినాథరావు, పాఠశాల డైరెక్టర్ కెల్ల మంజు భార్గవి, కరస్పాండెంట్ కెల్ల గోవింద, ప్రిన్సిపాల్ ఎస్.గౌరునాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.


ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

స్వచ్ఛతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని డిసిసిబి కాలనీ పరిసరాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రమైన రాష్ట్రాల్లో నెంబర్‌వన్‌గా నిలపాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. నివాసిత ప్రాంతాలు, గ్రామా పంచాయతీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు, ఆస్పత్రులు, బస్టాప్‌లు, రైల్వేస్టేషన్లు, పరిశ్రమ లు తదితర ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో పరిశుభ్రత కార్య క్రమాలు చేపట్టాలన్నారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో...

ఎస్‌పి కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు సర్కిల్ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం, స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు శుభ్రం చేయడంతో పాటు పిచ్చిమొక్కలు తొలిగించి, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, ఇతర అంటువ్యాధుల బారిన పడకుండా తక్కువ లోతు, లోతుగా ఉన్న వర్షపునీటి డ్రైనేజీ కాలువలను శుభ్రపరచడం, మొక్కలను నాటి, చుట్టుపక్కల పరిసరాల్లో ఉండే చెత్తా చెదారం, పిచ్చి మొక్కలను, పచ్చికను తొలగించి పరిశుభ్రం చేశారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్.రుద్రమ రాణి, యూత్ రెడ్‌క్రాస్ కమిటీ కో-ఆర్డినేటర్ ఐ.హేమ పద్మజ పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు.

ఎచ్చెర్ల: స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ఎచ్చెర్ల మండల కేంద్రం లో విద్యార్థులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. డిసిఎంఎస్ చైర్మన్ అవినాష్, అన్నెపు భువనేశ్వర రావు, బెండు మల్లేష్, చౌదరి బాబ్జి, సనపల రామారావు, తమ్మినేని శ్రీనివాస్, గాలి రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీను నిర్వహించారు. వర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఎంపిడిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, వర్శిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా.ఎం.అనురాధ, డా. సిహెచ్ రాజశేఖరరావు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆముదాలవలస: మార్కెట్‌కమిటీ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రలో భాగంగా సెక్రటరీ సాగర్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న చెత్తను సేకరించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. సూపర్‌వైజర్లు జయ, చిన్నప్పమ్మ, అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ పి. శారద, డిఇఒ రేఖ, యార్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో కమిషనర్ తమ్మినేని రవి ఆధ్వర్యంలో సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో చెత్త సేకరణ చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు, అధికారులు పాల్గొన్నారు.

నరసన్నపేట : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్రలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు చిరు సత్కారం చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వరప్రసాద్, ఐసిడిఎస్ పిఒ శోభారాణి, ఎంఇఒ శాంతారావు, ఎఎంసి చైర్మన్ పి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మెళియాపుట్టి, చాపర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో స్వచ్ఛాంధ్రను పురస్కరించుకొని మొక్కలు నాటారు. బిజెపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ శరత్‌కుమార్, హౌసింగ్ ఎఇ గణేష్ కుమార్, చాపర ప్రభుత్వ వైద్యాధికారులు హేమంత లక్ష్మి, పావని, కెజిబివి ప్రిన్సిపాల్ రమ్య పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజ నిర్మాణం అవుతుందని వైద్యాధికారులు డాక్టర్లు వాహిని ప్రియాంక, వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని గోవిందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్రలో పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఇఒ సన్యాసిరాజు, ఫార్మసీస్టు సుబ్రమణ్యం, హెల్త్ విజిటర్ తేజ్యం, ఆరోగ్య కార్యకర్తలు కృష్ణవేణి, అమ్మన్నమ్మ, ఆశా కార్యకర్తలు అమరావతి, కృష్ణవేణి, జానకి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలంలంలోని డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛాంధ్రలో డిప్యూటీ ఎంపిడిఒ ఎల్.వెంకటరావు, కార్యదర్శి కృష్ణలు పాల్గొని విద్యార్థులకు ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కె.జానికిరావు, ఉపాధ్యాయులు ఎల్.గోవిందరావు, శ్రీహరి, ఎంపిడిఒ కార్యాలయ, హెల్త్ అసిస్టెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

కవిటి: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి అన్నారు. స్వర్ణాంధ్రలో భాగంగా బెలగాం పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల, బి.జి.పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవివర్మ, ఎపిడి శ్రీనివాసరెడ్డి, ఎఒ శ్రీదేవి, ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, బాసుదేవ్ రౌళో, సంతోష్ పట్నాయక్, డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, ఎపిఎం గోవిందరావు పాల్గొన్నారు.

పలాస : స్వచ్ఛాంధ్రలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో ఆవరణలో ఎంపిడిఒ కె.వసంతకుమార్ ఆధ్వర్యాన పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ఎఒ అనూరాధ, సీనియర్ అసిస్టెంట్ మన్మథరావు పాల్గొన్నారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో కమిషనర్ ఎన్. రామారావు ఆధ్వర్యాన వార్డుల్లో దోమల నివారణపై అవగాహన కల్పించారు.


శ్రీకాకుళం సిటీ : పరిశుభ్రత కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకర్

సంధ్యకు 'తెలుగు తేజం' అవార్డు

ప్రజాశక్తి- కవిటి


సాహు సంధ్య

మండలంలోని మాణిక్యపు రానికి చెందిన యువ కవయిత్రి సాహు సంధ్య ప్రతిష్టాత్మకమైన 'తెలుగు తేజం' అవార్డుకు ఎంపికై గర్వకారణంగా నిలిచారు. అంతర్జాతీయ సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏటా అందించే ఈ పురస్కారం, తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న ప్రతిభావంతులకు ప్రదానం చేస్తారు. ఇటీవల కాలంలో సంధ్య రాసిన కవితలు, కథలు సమాజ చైతన్యాన్ని పెంపొందించేలా ఉన్నాయని అన్నారు. అందుకే ఎంపిక చేశామని సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు శనివారం సంధ్యకు అధికారిక ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ నెల 31న పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించనున్న తెలుగు భాషా దినోత్సవం సభలో ప్రముఖుల సమక్షంలో ఈ అవార్డు అందించనున్నారు. తనను ఈ గౌరవానికి ఎంపిక చేసిన సంస్థ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షులు ఈశ్వరీ భూషణం, మీడియా ప్రతినిధి అమ్ము బమ్మిడి, ప్రధాన కార్యదర్శి పార్థసారథిలకు సంధ్య ధన్యవాదాలు తెలిపారు.


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘ సభ్యులు

వ్యాధులపై అప్రమత్తం

ఇచ్ఛాపురం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రమేష్ అన్నారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని, వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల పెరుగుదల నియంత్రించే మార్గాలు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత మొదలగు జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం టెర్రస్ గార్డెనింగ్, హోంకంపోస్టు చేసి తడి చెత్తను తగ్గించాలని సూచించారు. ముడియా వీధిలో ఒకరి ఇంటి వద్ద రెండు ఫ్లోర్లలో టెర్రస్ గార్డెనింగ్‌ను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర కుమార్, సచివాలయ శానిటరీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం


రామకృష్ణ శర్మ (ఫైల్)

పలాస : పలాసకు చెందిన ధర్మపురి రామకృష్ణ శర్మ నేత్రాలు సంజీవంగా నిలిచాయి. శర్మ శనివారం మృతి చెందడంతో శ్రీకాకుళం జిల్లా సత్యసాయి సంస్థల సాధన శిబిరం ఇన్‌ఛార్జి శ్రీనివాస్, పలాస సత్యసాయి సేవా సమితి ప్రతినిధులతో వారి కుమారులు భార్గవ్, కాశ్యప శర్మ శ్రీకాకుళం రెడ్ క్రాస్ సొసైటీని సంప్రదించారు. టెక్నీషియన్ పి.సుజాత, పి.చిన్నికృష్ణ కార్నియ సేకరించి విశాఖపట్నం ఎల్‌వి.ప్రసాద్ నేత్రాస్పత్రికి తరలించారు. నేత్రాలను దానం చేయడంతో పలాస సత్య సాయి సేవా సమితి కన్వీనర్ తిరుమల, కౌంత్యేశ్వరుడు, రామేశ్వరరావు, శ్రీనివాస్, కామేశ్వరరావు అభినందించారు.

గురుమూర్తికి సన్మానం

ప్రజాశక్తి- రణస్థలం

ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక 7వ వార్షికోత్సవం సందర్భంగా వజ్రపుకొత్తూరు మండలం కంబాల రాయుడుపేటలో శుక్రవారం రాత్రి జరిగిన 15 మంది పరిషత్ పోటీల్లో రణస్థలం మండల కేంద్రానికి చెందిన బోనం గురుమూర్తి ప్రథమ బహుమతి అందుకున్నట్లు శనివారం తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.3వేలు, మెమోంటో ఇచ్చి ఘనంగా సన్మానించినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో కుష్టు వ్యాధిగ్రస్తుడుగా నటించినట్లు పేర్కొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ


తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ తాళాసు గోవిందరావు ఎరువుల దుకాణాన్ని ఆర్‌డిఒ జి.వెంకటేష్, కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ వేణుగోపాలరావు, పలాస వ్యవసాయశాఖ ఎడిఎ ఎం.రామారావు శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు గోదాంలోని ఎరువులను పరిశీలించారు. రికార్డులో ఉన్న సరుకు, గోదాంలో నిల్వ ఉంచిన సరుకును పోల్చిచూశారు. సరుకు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ నందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎరువులు దుకాణాల్లో అధిక ధరలకు విక్రయాలు చేపట్టినా, నిల్వ ఉంచి బ్లాక్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేటు ఎరువులు వ్యాపారులు రైతులకు ఇబ్బంది కలిగించకుండా వారు కావాల్సిన ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని వ్యాపారులకు అదేశించారు. రైతులు తమ అధార్, 1బి తీసుకొస్తే ఎరువులను పంపిణీ చేయాలని సూచించారు. యూరియా కన్నా నానో యూరియా ఎక్కువ ఫలితం ఇస్తుందని, దీనిని రైతులు ఎక్కువుగా వినియోగించాలని అన్నారు. నానో యూనియా వాడకాన్ని వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి పోలారావు, వ్యాపారి తాళాను గోవిందరావు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంలో దూసుకుపోతున్నాం

ప్రజాశక్తి- కవిటి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్‌విజె విద్యా సంస్థల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లు కె.సింహాచలం నాయుడు, ఎం.భాస్కరరావు, జె.సంగీత మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానంలో భారతదేశం వేగంగా దూసుకుపోతోందని కొనియాడారు. అంతరిక్ష పరిశోధనలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందని, వాటిని వినియోగించి భారత్ అనేక ఉపగ్రహాలను ప్రయోగిస్తోందని వివరించారు. ఇతర దేశాల ఉపగ్రహాలను కూడా భారత రాకెట్లు అంతరిక్షంలో ప్రవేశపెడుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎస్ పిఒ జె.పాపారావు, జి.విష్ణుమూర్తి, పి.శ్రీహరి, కె.ఉగాదినాయుడు, బి.శ్రీనుబాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, జనార్ధనరావు, ఎల్.ఆనంద్, బి.జగ్గారావు, ఆర్.మహేష్, జి.జగన్నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిజె కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు

ఘనంగా 'టంగుటూరి' జయంతి


ధ్రువపత్రాలను అందజేస్తున్న కృష్ణమూర్తిరెడ్డి

ఇచ్ఛాపురం: స్థానిక శాంతినికేతన్ విద్యా సంస్థలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి టంగుటూరి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రి అని అన్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని ఆంధ్రా మొదటి ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. మద్రాస్ నుంచి ప్రత్యేకాంధ్రా సాధనలో నిర్ణాయక పాత్ర పోషించారని అన్నారు. అనంతరం జెసిఐ నిర్వహించిన స్కాలర్ సిప్ ఆప్టిట్యూడ్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శాంతి, యశోద, పార్వతి, ప్రమీల, స్నేహ, సరోజిని ఎస్.యల్స్, జిహారిక, యువశ్రీ, ఇంటరాక్ట్ ప్రెసిడెంట్ మోహన్, ప్రియా, సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- బూర్జ

పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఐ ప్రవళ్లిక అన్నారు. శనివారం మండలంలోని పెద్దపేటల ఆర్ట్స్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శక్తి టీం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో కౌన్సిలింగ్ ద్వారా మంచి నడవడికలు నేర్పించాలన్నారు. 18 ఏళ్లు నిండిన బాలికలకు సెల్ ఫోన్ రాత్రి సమయాల్లో వాడకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వలన జరిగే అనార్థాలను వివరించారు. ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ బాలికలకు తల్లిదండ్రులు వారి ఆచార సాంప్రదాయాలు నేర్పించి మంచి మార్గంలో నడిచే విధంగా అవగాహన పర్చాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుస్మిత ఆర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎన్.అనూప్, సిఇఒ వి.శంకరరావు, ఎం.రవి, పద్మ ప్రసన్న, ఆర్ట్స్ కో-ఆర్డినేటర్ మనీషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుస్మిత

కిశోర బాలికల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం ప్రసూతీ స్త్రీ వైద్యుల సంఘం సభ్యులు, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి, డా కె. అనిత, డిసిహెచ్ఎస్ కళ్యాణ్‌బాబు కలిసి కిశోర బాలికల ఆరోగ్యంపై వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, కెజిబివి ప్రిన్సిపాల్ సమన్వయ సహకారాలతో వసతి గృహాల్లో కిశోర బాలికల సంపూర్ణ, సాగ్స్ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికల సంపూర్ణ ఆరోగ్యం, వారిలో రక్తహీనతను గుర్తించుట, హెచ్‌బి స్క్రీనింగ్, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక పరిశుభ్రత, నోటి పరిశుభ్రత, ప్రవర్తనా మార్పు కమ్యూనికేషన్, ఆటలు, క్రీడలు వంటి వాటిపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సాగ్స్ సభ్యులు రేవతి, అరవింద్, ప్రశాంతి, హరిత, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని పలు గ్రామాల్లో పలువురుని శనివారం ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరామర్శించారు. లోపెంట సర్పంచ్ నాయన పైడయ్యరెడ్డి అనారోగ్యంతో బాధ పడుతుండటంతో ఆయన్ని పరామర్శించారు. బుడుమూరు గ్రామానికి చెందిన కింతలి గోపాలరావు బావ బొడ్డ గోవిందరాజులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. తాళ్లవలస గ్రామానికి చెందిన బూత్ కమిటీ అధ్యక్షుడు మీసాల శ్రీనువాసరావు అమ్మమ్మ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, ఎంపిటిసిల సంగం అధ్యక్షుడు జగ్గారోతు తవిటినాయుడు, తాళ్లవలస సర్పంచ్ ప్రతినిధి దేశెట్టి తిరుపతిరావు, మీసాల శ్రీనువాసరావు, బుడుమూరు సర్పంచ్ ప్రతినిధి పెదనాయని చిట్టిబాబు, ఎంపిటిసి బొడ్డ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి మండలంలోని మాణిక్యపురం 11 కెవి ఫీడర్‌లో ఆర్‌డిఎస్‌ఎస్ పనులు కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలోని మాణిక్యపురం, బల్లి పుట్టుగ, వరక, కుసుంపురం పంచాయతీల పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న జైమునిరావు

ఎరువులు సరఫరా చేయాలని వినతి

మెళియాపుట్టి : ఎరువులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఎరువులను సరఫరా చేయాలని వైసిపి మండల కన్వీనర్ పోలాకి జైమునిరావు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ బడే పాపారావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులకు ఎరువులు అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో ఎరువుల కొరత ఉండేది కాదని, ఇప్పుడు ఎందుకు ఆ పరిస్థితి వస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కుక్కలు, ఆవుల సంచారాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో సాయినగర్‌లో రోడ్డులో విచ్చలవిడిగా కుక్కలు, ఆవులు తిరుగుతున్నాయని, వీటిని తక్షణమే నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాత్రివేళల్లో కాలనీకి రావాలంటే భయపడే స్థితి ఏర్పడుతుందన్నారు. సొంత యజమానూలు తమ పశువులు కట్టేందుకు సరైనా చోటు లేకపోవడంతో వీధిలోకి విడిచి పెడుతున్నారని వివరించారు. ఇప్పటికే అనేక మంది కుక్కలు, ఆవులు బారిన పడి ఆస్పత్రి పాలయ్యారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి మాజీ కార్యదర్శి నందిక జాని, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.